నేడు ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

జిల్లాలో 2,24,521 మందికి రూ.97.19 కోట్ల పంపిణీకి సిద్ధం

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పింఛన్లను ప్రభుత్వ ఆదేశాల మేరకు జనవరి ఒకటికి బదులుగా ఒక్కరోజు ముందుగానే ఈ నెల 31న పింఛన్లను అందజేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. జిల్లాలో 2,24,521 మంది లబ్ధిదారులకు రూ.97.19 కోట్లు సొమ్ము పింఛన్ లబ్ధిదారుల ఇంటింటికీ స్వయంగా వెళ్లి పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు. పింఛన్ల పంపిణీలో లబ్ధిదారులకు ఏమైనా సమస్య ఉంటే వెంటనే జిల్లా అధికారులకు తెలియజేయాలన్నారు.

అంతా నా ఇష్టం..!

మత్స్యశాఖలో ఇష్టారాజ్యం

నిడమర్రు ఎఫ్‌డిఒ రవికుమార్ అడ్డగోలు వ్యవహారం

వివాదాస్పద భూముల్లో చేపల చెరువులకు అనుమతి

పిజిఆర్ఎస్ ఫిర్యాదు పరిష్కారం కాకుండానే ముందుకు

33 ఎకరాల చేపల చెరువులో మ్యూటేషన్ కాని, నోషనల్ ఖాతాల భూములు

ఎఫ్‌డిఒ వ్యవహార శైలిపై ఇప్పటికే విచారణ పూర్తి

తప్పు చేసినట్లు నిర్ధారణ, చర్యలు తీసుకునేలోపు అడ్డగోలు వ్యవహారాలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మత్స్యశాఖలో కొంతమంది అధికారుల బరితెగింపు వ్యవహారం జిల్లాలో హాట్‌టాపిక్‌గా మారింది. నిబంధనలకు విరుద్ధంగా చేపల చెరువులకు అనుమతులు ఇస్తున్న తీరు అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. నిడమర్రు మండల మత్స్య శాఖాధికారి పివి.రవికుమార్ వ్యవహరిస్తున్న తీరు ఆ శాఖ ప్రతిష్టను మరింత దిగజారుస్తున్న పరిస్థితి ఉంది. కొంతమందికి వత్తాసు పలుకుతూ సాఫీగా సాగుతున్న చేపల చెరువులకు నిబంధనలకు విరుద్ధంగా నోటీసులు జారీ చేసి వివాదాలు సృష్టించడంతోపాటు, నిబంధనలకు విరుద్ధంగా చేపల చెరువులకు అనుమతులు మంజూరు చేసేందుకు పూనుకుంటున్న తీరు సదరు అధికారి బరితెగింపుకు నిదర్శనమనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఇప్పటికే ఎఫ్‌డిఒ వ్యవహార శైలిపై మత్స్యశాఖ కమిషనర్ ఆదేశాలతో జిల్లా అధికారులు విచారణ చేయడం, ఎఫ్‌డిఒ అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు తేల్చడం సైతం జరిగింది. ఎఫ్‌డిఒపై చర్యలు తీసుకోవడంలో ఆలస్యంతో సదరు అధికారి మరింత రెచ్చిపోయి వ్యవహరిస్తున్న పరిస్థితి.

వివాదాస్పద చెరువులో పంట బోదె ఉన్నట్లు నిర్ధారించి బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు (ఫైల్‌ఫోటో)

నిడమర్రు మండలం అడవికొలను రెవెన్యూ పరిధిలోని తిమ్మారావుగూడెంలో 148 నుండి 163 సర్వే నెంబర్లలో దాదాపు 70 ఎకరాల చేపల చెరువు ఉంది. ఆ చెరువులోని 159-4 సర్వే నెంబర్‌లో పంట బోదెకు సంబంధించిన 94 సెంట్ల ప్రభుత్వ భూమి ఉంది. ఇటీవల దీనిపై సాగునీటి హక్కు గల రైతుల ఫిర్యాదుతో అధికారులు చర్యలు చేపట్టారు. రెవెన్యూ అధికారులు పంట బోదెను విడదీయడం సైతం జరిగింది. ఇప్పుడు పంట బోదెకు ఆనుకుని ఉన్న 148 నుంచి 154, 160 సర్వే నెంబర్లలో 33 ఎకరాల చేపల చెరువు ఏర్పాటుకు మత్స్యశాఖ అధికారులకు దరఖాస్తు అందింది. ఈ చెరువు 40 ఎకరాల వరకూ ఉంటుందని, ఆ భూముల్లో 153-1, 153-2 సర్వే నెంబర్లలో నోషనల్ ఖాతాల భూములు ఉన్నాయని పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదులు సైతం అందాయి. అంతేకాకుండా మ్యూటేషన్ కాని భూములు ఐదెకరాలకుపైగా ఉన్నాయి. ఈ భూములకు సంబంధించి ఎటువంటి దరఖాస్తులూ లేవు. దీంతో సదరు దరఖాస్తును కొద్దిరోజుల క్రితం కింది నుంచి పైవరకూ ఉన్న మత్స్యశాఖాధికారులంతా తిరస్కరించారు. తిరస్కరణకు కారణాలు సైతం వెల్లడించారు. ఈ చెరువుపై పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు పెండింగ్‌లో ఉందని, ఈ చెరువు పరిధిలో ఇరిగేషన్ కెనాల్ వివాదం ఉందని, సరైన ఆటోక్యాడ్ మ్యాప్ లేదని, ప్రతిపాదిత చేపల చెరువుకు గట్లు విడదీయలేదని పేర్కొంటూ తిరస్కరించారు. అదే చెరువు దరఖాస్తును మరోసారి రీఓపెన్ చేయగా మండలాధికారిగా ఉన్న ఎఫ్‌డిఒ రవికుమార్ అనుమతి ఇస్తున్నట్లు అప్రూవల్ ఇవ్వడం వివాదాస్పదంగా మారింది.

నివేదికలు కాలరాసి.. చేపల చెరువుకు అప్రూవల్

రెవెన్యూ, పంచాయతీ ఏశాఖలోనైనా గ్రామస్థాయిలోని అధికారి ఇచ్చిన నివేదిక ఆధారంగా ఉన్నతాధికారులు ముందుకు సాగుతారు. రెవెన్యూలో విఆర్‌ఒ, పంచాయతీ కార్యదర్శి ఇలా గ్రామస్థాయిలో అధికారుల నివేదికే కీలకం. ఏదైనా సమస్య వస్తే కిందిస్థాయి అధికారులపైనే సస్పెన్షన్ వంటి చర్యలు ఉంటాయి. కొయ్యలగూడెం మండలంలోని పరింపూడిలో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ జారీ ప్రక్రియలో జరిగిన అవకతవకల్లో విఆర్‌ఒను సస్పెండ్ చేశారు. తిమ్మారావుగూడెం చేపల చెరువు విషయంలో సచివాలయ ఫిషరీస్ అధికారి నిబంధనలు సరిగా లేవంటూ రిజెక్ట్ చేయగా, మండలాధికారి ఎఫ్‌డిఒ అప్రూవల్ ఇవ్వడం చూస్తే సదరు అధికారి అడ్డగోలు వ్యవహారం గురించి వేరే చెప్పనక్కర్లేదు. మ్యూటేషన్ చేయని భూములు ఉన్నాయని తెలుసు, నోషనల్ ఖాతాలు ఉన్నాయని తెలుసు. అయినా ఎఫ్‌డిఒ అప్రూవల్ చేశారంటే ఏం జరిగి ఉంటుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. తప్పు చేసిన సదరు అధికారిపై చర్యలు తీసుకోకుండా మత్స్యశాఖ అధికారులు వ్యవహరిస్తున్న ఉదాశీనతే ఇందుకు ప్రధాన కారణంగా చెప్పొచ్చు. జిల్లా మత్స్య శాఖాధికారులు, జిల్లా కలెక్టర్ వెంటనే సంబంధిత ఎఫ్‌డిఒపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారులు కోరుతున్నారు. ఇంత నిస్సిగ్గుగా నిబంధనలకు వ్యతిరేకంగా ఒక అధికారి వ్యవహరించడం తాము ఎన్నడూ చూడలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

భవ్య భీమవరానికి మరో మణిహారం

శంకుస్థాపన చేస్తున్న కలెక్టర్ నాగరాణి

డిజిటల్ లైబ్రరీ, చిల్డ్రన్ పార్క్‌కు శంకుస్థాపన

మరో ఆరు నెలల్లో అందుబాటులోకి విజ్ఞాన, వినోద కట్టడాలు

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి -భీమవరం

భవ్య భీమవరానికి శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ, డాక్టర్ బివి.రాజు ఫౌండేషన్ సహకారంతో భీమవరం పట్టణం నడిబొడ్డున ప్రజలకు, చిన్నారులకు విజ్ఞానాన్ని, వినోదాన్ని అందించే రూ.1.6 కోట్ల వ్యయంతో నిర్మించనున్న కట్టడాలు అందుబాటులోకి రానున్నాయి. మంగళవారం అంబేద్కర్ సర్కిల్ వద్ద ఆర్‌యుబికి, యనమదుర్రు డ్రెయిన్‌కు మధ్య పట్టాలకు ఇరువైపులా ఖాళీగా ఉన్న ముందు స్థలం 47 సెంట్లలో 'బాలల వినోద ఉద్యానవనం', వెనుక స్థలం 39 సెంట్లలో కమ్యూనిటీ లైబ్రరీ ప్రాజెక్ట్ నిర్మాణాలకు మంగళవారం కలెక్టర్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, విష్ణు కాలేజ్ స్టూడెంట్స్ ఎఫైర్స్ డైరెక్టర్ పి.శ్రీనివాసరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ సంవత్సర కాలంగా భవ్య భీమవరం పేరిట దాతల సహకారంతో ఎన్నో కార్యక్రమాలను చేపట్టి పూర్తి చేసుకున్నామన్నారు. డాక్టర్ బివి.రాజు ఫౌండేషన్ దాతృత్వంతో రూ.1.6 కోట్ల వ్యయంతో కమ్యూనిటీ లైబ్రరీ, బాలల వినోద ఉద్యానవన నిర్మాణాలను చేపట్టేందుకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, బివి.రాజు కళాశాల స్టూడెంట్స్ అఫైర్స్ డైరెక్టర్ పి.శ్రీనివాసరాజు, మున్సిపల్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

5 రోజుల పని అమలు కోరుతూ

బ్యాంకు ఉద్యోగుల ఆందోళన

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

బ్యాంకు ఉద్యోగులకు ఐదు రోజుల పనివిధానం అమలు చేయాలని కోరుతూ దేశవ్యాప్తంగా బ్యాంకు యూనియన్లు ఇచ్చిన పిలుపుమేరకు మంగళవారం తాడేపల్లిగూడెంలో బ్యాంక్ ఉద్యోగులు ఎస్‌బిఐ కెఎన్ రోడ్డు శాఖ ఇ-కార్నర్ వద్ద నిరసన తెలిపారు. రెండు సంవత్సరాలుగా చర్చలు జరుపుతున్నా సమస్య పరిష్కరించకుండా ప్రభుత్వం, ఐబిఎ తాత్సారం చేస్తున్నాయని, వెంటనే సమస్య పరిష్కరించకుంటే నిరసన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బ్యాంకు ఉద్యోగుల కోఆర్డినేషన్ కమిటీ నాయకులు విఆర్ఎస్ఎన్.శాస్త్రి, నేతలు బి.దివ్య రజన, లింగంపల్లి గాంధీ, ఎం.కిరణ్ డేనియల్, కె.శ్రీనివాస్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎం.వీరబాబు, నాగరాజు, దుర్గాప్రసాద్, ఎస్‌విఎస్.ప్రసాద్, మూర్తి, సిద్దాబత్తుల సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

గీతాలు ఆలపిస్తున్న కళాకారులు

అంబరాన్నంటిన శ్రామిక సంబరం

పద పద విశాఖ.. అంటూ కార్మికలోకానికి పిలుపు

ఆట.. పాట.. మాటతో నిలువెల్లా ఉత్సాహం

ప్రజాశక్తి - భీమవరం

భీమవరంలో శ్రామిక ఉత్సవ్ పండగ సంబరాలు అంబరాన్నంటాయి. ఆట.. పాట.. మాటలతో పద పద విశాఖ అంటూ కార్మికలోకం పిలుపునిచ్చింది. వివిధ నృత్య ప్రదర్శనలు సందడి నింపాయి. దీంతో మున్సిపల్ కాలనీ సందడిగా మారింది.

-వార్త మెయిన్‌లో

చిన్నారుల నృత్య ప్రదర్శన

నైపుణ్య పోటీల్లో జిల్లా విద్యార్థుల సత్తా

అభినందించిన కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్రస్థాయి నైపుణ్య పోటీల్లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. చెరుకువాడ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు మంగళవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో కలెక్టర్ చదలవాడ నాగరాణిని కలిసి సాధించిన విజయాన్ని వివరించారు. నిజ జీవితంలో ఎలక్ట్రాన్స్ ద్వారా సాధించే అద్భుతాలపై ప్రాజెక్టును రూపొందించి ప్రదర్శించామని, ఈ ప్రాజెక్టుకు రాష్ట్రస్థాయిలో మెడల్స్, సర్టిఫికెట్లతోపాటు రూ.25 వేల నగదు బహుమతిని సాధించామని వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పోటీల్లో ఎలక్ట్రానిక్స్ ట్రేడ్‌లో మన జిల్లా జెడ్‌పి హైస్కూల్ ఒకేషనల్ విద్యార్థులు ప్రతిభ చాటడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో జాతీయస్థాయిలో నిర్వహించే ఇండియా స్కిల్స్ పోటీల్లోనూ విజయం సాధించాలన్నారు. రాష్ట్రాల్లో యువత తమ నైపుణ్యాలను ప్రదర్శించి, విజయం సాధిస్తే, జాతీయ, ప్రపంచ వేదికలపై ప్రాతినిధ్యం వహించే అవకాశం పొందుతారని తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఎంపిక చేసిన 35 జిల్లా పరిషత్, పిఎంశ్రీ పాఠశాలల్లో ఎనిమిది ట్రేడ్స్‌లో ఒకేషనల్ తరగతులను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వీటిలో బ్యూటీథెరపీ, ఎలక్ట్రానిక్స్, అగ్రికల్చర్, రిటైల్స్, బిఎఫ్ఎస్ఐ, ఆటోమేషన్, ఐటి అండ్ ఐటిఇఎస్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి వివిధ నైపుణ్య విభాగాల ట్రేడ్లలో శిక్షణను అందిస్తామన్నారు. విద్యార్థుల అభిరుచి మేరకు తరగతి సబ్జెక్టులతో సమాంతరంగా ఏదో ఒక ట్రేడ్‌లో ఒకేషనల్ ట్రైనింగ్ పొందవచ్చన్నారు. జి.దిలీప్, వి.కేశవ్ హృదయ్, డి.జోసెఫ్‌రాజు, డి.సాత్విక్ ఎలక్ట్రానిక్స్ విభాగంలో తయారు చేసిన ప్రాజెక్టు రాష్ట్రస్థాయిలో ఎంపికైందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఎ ఎపిసి పి.శ్యామసుందర్, డిఇఒ ఇ.నారాయణ, జిల్లా ఒకేషనల్ కోఆర్డినేటర్ పి.సంజీవ్‌కుమార్, జిసిడిఒ జెస్సీ దీవెనమ్మ, ఎఎంఒ సిహెచ్.చంద్రశేఖర్, ఉపాధ్యాయులు వి.నిష్యంత్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వీట్ల దుకాణంలో కమిషనర్ తనిఖీలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పట్టణంలోని స్వీట్స్ దుకాణాలను మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. స్థానిక సాయిరాం ఫుడ్స్ అండ్ స్వీట్స్ షాపును ఆయన తనిఖీ చేశారు. స్వీట్స్ తయారు చేసే స్థలం అపరిశుభ్రంగా ఉండటం, సిబ్బందికి గ్లౌజులు లేకపోవడం, డ్రెయినేజీపై మూతలు లేకపోవడం, కార్ఖానా బూజులతో నిండి ఉండటంతో దుకాణ యజమానికి రూ.పది వేలు జరిమానా విధించారు. నోటీసులు కూడా జారీ చేసినట్లు కమిషనర్ తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు ఆహార పదార్థాల కొనుగోలులో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కమిషనర్‌తోపాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మా వరి పొలాలను రక్షించండి.. మహాప్రభో

ఆక్వా సాగుతో పంట సారం కోల్పోయి తీవ్ర నష్టం

ఇరిగేషన్ అధికారుల వద్ద విస్సాకోడేరు లంకదొడ్డి ప్రాంత రైతులు ఆవేదన

ప్రజాశక్తి - పాలకోడేరు

ఆక్వా సాగు వల్ల పంట నీరు కలుషితమవుతుంది. చెరువులకు కనీసం మురుగుబోదె లేకపోవడంతో వరి చేలల్లోకి నీరొచ్చి పంట సారం కోల్పోతుంది. దీనివల్ల తీవ్ర నష్టం వాటిల్లుతుందని, తమ పొలాలను రక్షించండి మహాప్రభో అంటూ ఇరిగేషన్ అధికారుల వద్ద విస్సాకోడేరు లంకదొడ్డి ప్రాంత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. లంకదొడ్డి ప్రాంతంలో 180 ఎకరాల వరి ఆయకట్టు ఉంది. దీనిపైనే ఎంతోమంది రైతులు, కౌలురైతులు, నిరుపేదలు, వ్యవసాయ కూలీలు ఆధారపడి జీవిస్తున్నారు. అయితే ఈ ఆయకట్టుకు చేర్చి సుమారు వందెకరాలు ఆక్వా సాగు జరుగుతోంది. అయితే వాస్తవానికి రొయ్యలు సాగు చేసేందుకు అనుమతులు లేకపోయినప్పటికీ ఎక్కువశాతం రైతులు రొయ్యల పెంపకం చేస్తున్నారు. దీనికితోడు ఈ చెరువులకు కనీసం మురుగుబోదె లేకపోవడంతో చెరువుల్లోని కలుషిత నీరు గొరగనమూడి పంట కాల్వలోకి వదిలేయడంతో ఆ నీరంతా వరి చేలల్లోకి చేరి పంట సర్వ నాశనమవుతోంది. ఈ నేపథ్యంలో తమ వరి పంటను రక్షించాలని కోరుతూ ఇటీవల కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణికి పిజిఆర్ఎస్‌లో రైతులు ఫిర్యాదు చేశారు. దీనిలో భాగంగా నీటి పారుదల శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ దుర్గాప్రసాద్ లంకదొడ్డి ప్రాంతంలో పర్యటించారు. ఇటు వరి పొలాలను, అటు ఆక్వా చెరువులను పరిశీలించారు. రైతుల వద్ద నుంచి పలు వివరాలు నమోదు చేశారు. ఈ సందర్భంగా వరి రైతులు అనేక సమస్యలను ఇరిగేషన్ అధికారులు దృష్టికి తీసుకొచ్చారు. తమ వరి పొలాలను రక్షించి తమకు న్యాయం చేయాలని కోరారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం ఉండట్లేదన్నారు. తమ న్యాయమైన సమస్య పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామని తెలిపారు. దీనిపై స్పందించిన దుర్గాప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో అధికారికంగా రొయ్యల చెరువులకు అనుమతి లేదని, కేవలం చేపల చెరువులకు మాత్రమే అనుమతి ఉందని, దీనిపై సమగ్ర నివేదిక తయారుచేసి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామని తెలిపారు. సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు. రైతులు ఆరేపల్లి సత్యనారాయణ, భీమవరం మున్సిపల్ మాజీ కౌన్సిలర్ బొక్కా చంద్రమోహన్, దుండి అశోక్‌బాబు, ఈశ్వరయ్య, ఆదినారాయణ, ప్రసన్న, రైతులు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న ఇరిగేషన్ అధికారులు

తరలిరండి.. సిఐటియు సభకు

తాడేపల్లిగూడెంలో పోస్టర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి - వీరవాసరం

విశాఖపట్నంలో ఈ నెల 31 నుండి జనవరి 4వ తేదీ వరకు జరిగే సిఐటియు అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ మండలంలో మంగళవారం మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కొణితివాడలో ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరాం జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ నౌడూరు, బుధారాయుడు చెరువు మీదుగా వీరవాసరం వరకు సాగింది. ర్యాలీనుద్దేశించి సిపిఎం సీనియర్ నాయకులు జుత్తిగ నరసింహామూర్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులు, కార్మికులు, రైతులకు వ్యతిరేకంగా తీసుకొస్తున్న చట్టాలను అతివేగంగా అమలు చేస్తుందని, వీటిని తిప్పికొట్టేందుకు కార్మికులు, కర్షకులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బొర్రా అలమహారాజు, తాళ్లూరి హరిహరలక్ష్మణ్, కిలాడి సత్యనారాయణ, కేతా జ్యోతిబసు, బాలం విజయ్‌కుమార్, రైస్‌మిల్ కార్మికులు పాల్గొన్నారు.

తణుకు: పోరాడితే పోయేదేమీ లేదని, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం తథ్యమని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ అన్నారు. మంగళవారం స్థానిక వాన్‌బరి పరిశ్రమ వద్ద గేట్ మీటింగ్ నిర్వహించారు. అనంతరం సిఐటియు అఖిలభారత మహాసభ జయప్రదం చేయాలని కోరుతూ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడగా, వాన్‌బరి యూనియన్ కార్యదర్శి వల్లూరి వెంకటశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.హర్షవర్ధన్, గుబ్బల గోపి, బ్రహ్మాజీ, రామకృష్ణ, సత్యనారాయణ, పి.దక్షిణామూర్తి పాల్గొన్నారు.

ఆచంట: సిఐటియు మహాసభను జయప్రదం చేయాలని మండల కన్వీనర్, కోకన్వీనర్ బండి రంగారావు, నేలపూడి విజయలక్ష్మి పిలుపునిచ్చారు. ఆచంట వేమవరంలో అంగన్వాడీలు కోలాటం చేస్తూ ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు.

ఆచంటలో..

తణుకులో..

కార్యక్రమంలో నాయకులు తోటపల్లి సత్యనారాయణ, పి.మోహన్‌రావు, తమరవరపు దుర్గాప్రసాద్, పుడక నాగలక్ష్మి, వెంకటలక్ష్మి, దుర్గ, సత్యలక్ష్మి పాల్గొన్నారు.

భీమవరం టౌన్: మండలంలోని లోసరి గ్రామంలో చలో విశాఖ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో పి.శ్రీను, సుబ్బారావు, తూటే శుభాకరరావు, బొడ్డు లక్ష్మీపతి, కృష్ణారావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మొగల్తూరు: విశాఖపట్నంలో జనవరి 4 సిఐటియు బహిరంగ సభకు కార్మికులంతా తరలిరావాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. మొగల్తూరులోని సత్రవపాలెంలోని సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో యడ్ల చిట్టిబాబు, చిలకలపూడి నాగేశ్వరరావు, అడ్డాల ఏడుకొండలు, జి.పెద్దింట్లు పాల్గొన్నారు.

పెనుగొండ: సిఐటియు అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ పెనుగొండ బస్టాండ్‌లో విస్తృత ప్రచారం నిర్వహించారు. మంగళవారం పెనుగొండ, వడలి, సిద్ధాంతం ప్రాంతాల్లో మహాసభ సన్నాహక ప్రచారంలో భాగంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి షేక్ పాదుషా, ఆటో వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: విశాఖపట్నంలో జనవరి 4న జరిగే సిఐటియు అఖిలభారత మహాసభకు తాడేపల్లిగూడెం పట్టణం నుంచి కార్మికులు, ఉద్యోగులు పెద్దసంఖ్యలో తరలిరావాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కర్రి నాగేశ్వరరావు తెలిపారు. సిఐటియు అఖిలభారత మహాసభను పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లావ్యాప్తంగా సభలు, సదస్సులు, ర్యాలీలు, కరపత్రాల పంపిణీ ద్వారా విస్తతంగా ప్రచారం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. బహిరంగ సభకు తాడేపల్లిగూడెం పట్టణం నుండి వెయ్యి మందిని సమీకరిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కన్వీనర్ జవ్వాది శ్రీనివాస్, మడక రాజు, దేశంశెట్టి సతీష్, సిద్దిరెడ్డి శేషు తదితరులు పాల్గొన్నారు.

మొగల్తూరులో..

వీరవాసరంలో..

భీమవరంలో జనవరి నుండి గోధుమ పిండి సరఫరా

బియ్యం కార్డుదారులకు మాత్రమే పంపిణీ - జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

వచ్చే ఏడాది జనవరి నుంచి జిల్లా కేంద్రమైన భీమవరం పట్టణంలో రేషన్ కార్డు లబ్ధిదారులకు నాణ్యమైన గోధుమ పిండిని పంపిణీ చేసేలా ప్రభుత్వం నిర్ణయించిందని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రమైన భీమవరం పట్టణంలోని 33,363 బియ్యం కార్డుదారులకు 49 రేషన్ దుకాణాల ద్వారా కార్డు ఒక్కింటికీ ఒక కిలో రూ.20 చొప్పున నాణ్యమైన గోధుమ పిండిని పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. దీనికి అవసరమైన ఏర్పాట్లు చేశామన్నారు. పట్టణంలోని కార్డుదారులందరూ జనవరికి సంబంధించి బియ్యం, పంచదారతోపాటు నాణ్యమైన గోధుమ పిండిని కూడా పొందవచ్చునని తెలిపారు.

ఇవిఎం గొడౌన్ తనిఖీ చేసిన కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం పిపి రోడ్డులోని స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గొడౌన్స్‌లో భద్రపర్చిన ఇవిఎం యంత్రాలను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మంగళవారం తనిఖీ చేశారు. గొడౌన్‌కు వేసిన సీళ్లను ఇవిఎంల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పర్యవేక్షణ రిజిష్టర్‌లో కలెక్టర్ సంతకం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ప్రతి మూడు నెలలకోసారి ఇవిఎంలు భద్రపర్చిన గొడౌన్ క్షుణ్ణంగా తనిఖీ చేసి సమగ్ర నివేదికను పంపిస్తామని తెలిపారు. గొడౌను వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. కలెక్టర్ వెంట డిఆర్‌ఒ బి.శివన్నారాయణ రెడ్డి, ఎలక్షన్ సెక్షన్ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ మాత్రావు సన్యాసిరావు, టిడిపి తరపున మరపట్ల శ్యాంబాబు, జనసేన తరపున బి.జయశివ, బిఎస్‌పి తరపున ఎం.రత్న రాజు ఉన్నారు.

గొడౌన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

రీ సర్వేకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు

ప్రజాశక్తి - ఆచంట

రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జి తహశీల్దార్ ఎం.సోమేశ్వరరావు అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నేటి నుంచి మండలంలోని వల్లూరు, ఆచంట గ్రామాల్లో రీసర్వే కార్యక్రమం జరుగుతుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రీ సర్వేకు ప్రత్యేక బృందాలుగా 25 మందిని విభజి సర్వేలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పొలం గట్లు వివరాలున్న పక్కాగా కొలుస్తున్నారు. ఎక్కడికక్కడ గ్రామస్తులు, భూ యజమానుల సమక్షంలోనే ఈ సర్వే జరుగుతుందన్నారు. గ్రామాల్లో దీర్ఘకాలంగా ఉన్న భూ సమస్యలు వేధిస్తున్నాయన్నారు. భూముల కొలతల్లో వాస్తవికతను యజమానులకు తెలియజేయాలన్న సంకల్పంతో కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఇప్పటి వరకూ మండలంలో కొడమంచిలి, కోడేరు, పెదమల్లం, కందరవల్లి, ఆచంట వేమవరం, పెనుమంచిలి గ్రామాల్లో రీసర్వే పూర్తయినట్లు తెలిపారు.

పెనుమంట్ర : మండలం పోలమూరులో జనవరి 2వ తేదీ నుంచి భూముల రీసర్వే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ వై.రవికుమార్ తెలిపారు. మంగళవారం సాయంత్రం పోలమూరులో పంట భూములు కలిగిన రైతులు, కౌలుదారులతో సమావేశం నిర్వహించారు. నాలుగు విభాగాలుగా 82 రోజులపాటు 912 ఎకరాల భూమిని రీ సర్వే చేసి, రికార్డులు పరిశీలించి భూ స్వామి ఆధీనంలో ఉన్న భూమి సర్వే చేసి చూపడం జరుగుతుందని ఆయన అన్నారు. పూర్వీకుల నుండి సంక్రమించిన భూములకు సంబంధించిన భూ దస్తావేజులు, ఒప్పంద పత్రాలు రిజిస్ట్రేషన్ పత్రాలను సిబ్బందికి చూపించాలని భూ యజమానులను తహశీల్దార్ కోరారు. ఏమైనా తేడాలుంటే మూడు దశల్లో ఫిర్యాదు చేసుకోవచ్చని తెలిపారు. రైతులందరూ రీసర్వేకి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కాకర రాజేశ్వరరావు, ప్రజాప్రతినిధులు, రైతులు, కౌలు రైతులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి సిమెంట్ బెంచీ బహూకరణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయం బుక్ రీడర్స్ క్లబ్ కమిటీ సభ్యులు గరిమెళ్ల బాపయ్య శర్మ వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం గ్రంథాలయానికి సుమారు రూ.4,000 విలువైన సిమెంట్ బెంచి బహూకరించినట్లు గ్రంథాలయాధికారి వై.వి.సాయిబాబు తెలిపారు. ఈ సందర్భంగా బాపయ్య శర్మను గ్రంథాలయ బుక్ రీడర్ సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ లైబ్రేరియన్ వి.శ్రీనివాసరావు, వి.రామాంజనేయులు, ఎ.జనార్దన్‌రావు, ఎవి.లక్ష్మణరావు, బాపూజీ, తంగేళ్ల మురళీకృష్ణ పాల్గొన్నారు.

పెనుమంట్ర : పేదలకు దుప్పట్లు పంపిణీ

పేదలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - పెనుమంట్ర

మానవత ఆధ్వర్యాన సోమవారం రాత్రి మండలంలోని మార్టేరు మానవత ఆత్మీయ సహకార కమిటీ చైర్మన్ చిర్ల శ్రీనివాసరెడ్డి పుట్టినరోజు సందర్భంగా సుమారు 80 మంది పేదలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్ఐ కె.స్వామి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా భావంతో పని చేయాలన్నారు. తన పుట్టినరోజును పేదల మధ్య జరుపుకుంటున్న శ్రీనివాసరెడ్డి అందరికీ ఆదర్శం కావాలని అన్నారు. కార్యక్రమంలో మానవత ప్రెసిడెంట్ శిరం విశ్వనాధం, మండల చైర్మన్ కడలి సుబ్రహ్మణ్యం, జిల్లా కమిటీ సభ్యులు కొత్త సత్యనారాయణ మూర్తి, రీజినల్ చైర్మన్ బాబాల శ్రీనివాసరావు, కో చైర్మన్ పడాల జగన్నాథ రెడ్డి, చదువుల నరేంద్ర పాల్గొన్నారు.

నరసాపురం:వైకుంఠ ఏకాదశి సందర్భంగా నరసాపురంలోని శ్రీ ఆదికేశవ ఎంబరు మన్నారు స్వామి కోవెల వద్ద యాచకులకు యునైటెడ్ కాపు వనిత క్లబ్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు మాట్లాడారు. కాపు వనిత క్లబ్ ఉపాధ్యక్షురాలు పుప్పాల ఉషా కమల రగ్గులు పంపిణీ చేయడం ఆనందదాయకమన్నారు. రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు రాజ్యలక్ష్మి శిరినిడి మాట్లాడుతూ ముక్కోటి ఏకాదశి రోజున వనిత క్లబ్ ద్వారా ఈ సేవా కార్యక్రమం చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాపు వనిత క్లబ్ ఉపాధ్యక్షురాలు పుప్పాల ఉషాకమల, కార్యదర్శి రంగినీడి భరణి, సహ కార్యదర్శి గంటా వెంకటరమణ, సభ్యులు ఆర్యన్ వాణి, చింతాలక్ష్మి కుసుమ పాల్గొన్నారు.

గణపవరం:గణపవరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఇందిరమ్మ కాలనీలోని పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు వెల్లంకి కిరణ్ రవిబాబు మాట్లాడుతూ ఇంటర్నేషనల్ లయన్స్ అధ్యక్షులు ఎపి సింగ్ పుట్టినరోజు సందర్భంగా పేదవారికి దుప్పట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా శ్రీకృష్ణ ఆలయ ఆవరణలో 50 కొబ్బరి మొక్కలు నాటినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి కెఎస్ఎన్.మూర్తి, బి.మాల్యాద్రి, ఎంఎల్ఎన్.నారాయణ, ఆలయ కమిటీ చైర్మన్ సభ్యులు పాల్గొన్నారు.

పద్మశాలి యువజన రాష్ట్ర అధ్యక్షుడిగా మణికంఠ

ప్రజాశక్తి - ఆకివీడు

పద్మశాలి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఆకివీడుకు చెందిన సప్ప మణికంఠ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తిరుపతిలో జరిగిన సంఘ రాష్ట్ర కార్యవర్గ మహాసభల్లో సంఘ రాష్ట్ర అధ్యక్షులు జివి.నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు వివరాలు మణికంఠ పాత్రికేయులకు తెలిపారు. ప్రస్తుతం మణికంఠ జిల్లా సంఘం అధ్యక్షులుగా కొనసాగుతున్నారు. సంఘం బలోపేతానికి మణికంఠ చేసిన కృషిని గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు ఆయన ప్రకటించారని తెలిపారు. మణికంఠ నూతన నియామకం పట్ల స్థానిక ప్రముఖులు, సంఘం నాయకులు ఆయనను అభినందించారు.

వృథాగా తాగునీరు

మొగల్తూరు: పైప్‌లైన్ ద్వారా సరఫరా చేసే శుద్ధి జలాలు శివారు ప్రాంతాలకు పూర్తిస్థాయిలో అందడం లేదు. మొగల్తూరులోని పేటపల్లం ప్రాంతంలో పైప్‌లైన్ ద్వారా సరఫరా చేసే శుద్ధి జలాలు లీకై వృథాగా పోతున్నాయి. శుద్ధి జలాలు పైప్‌లైన్ ద్వారా కుళాయిలకు వదిలే సమయంలో మరమ్మతులకు గురైన పైప్ లైన్ నుండి నీరు లీకై రహదారిపైకి చేరుతోంది. ఆ బురద నీరు తిరిగి పైప్‌లైన్‌ల వద్దకు చేరి శుద్ధి జాలలు కలుషితమవుతున్నాయి. దీంతో తాము రోగాల బారిన పడతామని ప్రజలు భయపడుతున్నారు. సంబంధిత అధికారులు పైప్‌లైన్‌కు మరమ్మతులు చేసి నీటి వృథాను అరికట్టాలని ప్రజల కోరుతున్నారు.

14 నుంచి జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు

నరసాపురం:జాతీయ స్థాయి స్త్రీ, పురుషులకు కబడ్డీ పోటీలు రుస్తుంబాద కబడ్డీ స్టేడియంలో జనవరి 14 నుంచి 18వ తేదీ వరకూ నిర్వహిస్తున్నట్లు మాజీ ఎంఎల్‌ఎ, గోగులమ్మ ఉత్సవ కమిటీ కన్వీనర్ కొత్తపల్లి జానకీరామ్, రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి వీరలంకయ్య చెప్పారు. రుస్తుంబాద గోగులమ్మ ఆలయం వద్ద వారు విలేకర్లతో మాట్లాడారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ పోటీలకు స్త్రీ, పురుషుల విభాగంలో వివిధ రాష్ట్రాలకు చెందిన 40 జట్లు పాల్గొంటాయని తెలిపారు. పోటీలకు నేషనల్ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో 20 మంది రిఫరీలు వస్తారని తెలిపారు. ఇప్పటి వరకూ జాతీయస్థాయిలో 26 సార్లు పోటీలు నిర్వహించామన్నారు. పోటీలు లీగ్ నాకౌట్ పద్ధతిలో జరుగుతాయన్నారు. ఈసారి విజేతలకు షీల్డ్‌తో పాటు రూ.7 లక్షల ప్రైజ్ మనీ అందిస్తున్నామన్నారు. మొదటి స్థానంలో నిలిచిన జట్టుకు రూ.లక్షా 50 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.లక్ష, తృతీయ స్థానానికి రూ.75 వేలు, నాలుగో స్థానం గెలిచిన జట్టుకు రూ.50 వేలు ఇస్తామన్నారు. స్త్రీ, పురుషుల విభాగంలో ప్రైజ్ మనీ సమానంగా ఇస్తున్నామన్నారు. జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులు కూడా పోటీలకు హాజరువుతున్నారన్నారు. విచ్చేస్తున్న జట్టులో జమ్ము కాశ్మీర్, కలకత్తా, హర్యానా, సిఐఎస్ఎఫ్ న్యూఢిల్లీ, ఆంధ్ర, యూపి, ఢిల్లీ, హిమాచల్‌ప్రదేశ్, కేరళ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన జట్లు ఉన్నాయన్నారు.

ఉపాధ్యాయునిపై సస్పెన్షన్ వేటు

ప్రజాశక్తి - పోడూరు

మండల కేంద్రం పోడూరులోని ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా పని చేస్తున్న మైలే నాగేశ్వరరావును సస్పెండ్ చేస్తూ డిఇఒ ఇ.నారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. బాలికలతో అసభ్యంగా ప్రవర్తించారనే ఫిర్యాదు మేరకు ఇప్పటికే స్థానిక పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. కఈ నేపథ్యంలో నాగేశ్వరరావును మూడు నెలలపాటు సస్పెండ్ చేస్తూ డిఇఒ ఉత్తర్వులు జారీ చేశారని ఎంఇఒ జి.విజయ్‌కుమార్ తెలిపారు.

ప్రతి రహదారినీ అభివృద్ధి చేస్తాం

అభివృద్ధి పనులకు ఎంఎల్‌ఎ శంకుస్థాపనలు

ప్రజాశక్తి - వీరవాసరం

పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్‌ఎ

మండలంలో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న ప్రతి రహదారినీ అభివృద్ధి చేస్తానని ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. వీరవాసరం మండలంలో పల్లె పండుగ 2.0లో రూ.4.24 కోట్లతో అభివృద్ధి పనులను మంగళవారం ఎంఎల్‌ఎ ప్రారంభించారు. ఈ మేరకు వీరవాసరంలో రూ.66 లక్షలతో నాలుగు పనులు, రాయకుదురులో రూ.12 లక్షలతో, పంజావేమవరంలో రూ.9.30 లక్షలతో, బిజిపాలెంలో రూ.17 లక్షలతో, ఉత్తరపాలెంలో రూ.18.50 లక్షలతో, మత్స్యపురిపాలెంలో రూ.20 లక్షలతో, మెంటేపూడిలో రూ.8 లక్షలతో ఒక్కో పని, కొణితివాడలో రూ.13.50 లక్షలతో, నవుడూరులో రూ.46 లక్షలతో, తోలేరులో రూ.37 లక్షలతో, మత్స్యపురిలో రూ.65 లక్షలతో, బాలేపల్లిలో రూ.41 లక్షలతో, వడ్డిగూడెంలో రూ.71 లక్షలతో రెండేసి చొప్పున పనులకు ఎంఎల్‌ఎ భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు చికిలే మంగతాయారు, భీశెట్టి లక్ష్మి, నల్లిమెల్లి వేణుక, రాష్ట్ర మహిళ సహకార ఆర్థిక కార్పొరేషన్ ఛైర్మన్ పీతల సుజాత, ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని చంద్రశేఖర్, జెడ్‌పిటిసి గుండా జయప్రకాష్ నాయుడు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

యంత్రాంగం సమిష్టి కృషితో నేరాలు తగ్గుముఖం

జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి

ప్రజాశక్తి - భీమారం టౌన్

జిల్లా పోలీస్ యంత్రాంగం సమిష్టి కృషితో జిల్లాలో ఈ ఏడాది నేరాలు గత ఏడాది కంటే 19.03 శాతం నియంత్రించ గలిగామని జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి తెలిపారు. 2025లో జిల్లాలో జరిగిన నేరాలపై రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్‌పి భీమారావుతో పాటు భీమవరం డిఎస్‌పి రఘువీర్ విష్ణు, నరసాపురం డిఎస్‌పి శ్రీవేద, తాడేపల్లిగూడెం డిఎస్‌పి విశ్వనాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ నిరంతర నిఘా ఫలితంగా జిల్లాలో 19.03 శాతం తగ్గిన నేరాల్లో భాగంగా ఆస్తి నేరాల్లో 26 శాతం తగ్గాయన్నారు. సైబర్ నేరగాళ్లపై ఉక్కుపాదం మోపి రూ. 96.92 లక్షల నగదు, గోల్డ్, రూ.42.10 లక్షలు, 1236 కేజీల గంజాయి ధ్వంసం చేసుకున్నామని తెలిపారు. మహిళల భద్రతకు పెద్దపీట వేశామన్నారు. లైంగిక నేరాలకు పాల్పడే 68 మందిపై రౌడీ షీట్లు తెరిచామన్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ 3742 సిసిటివి కెమెరాలు, 3 డ్రోన్ల సహాయంతో జిల్లా వ్యాప్తంగా నిరంతర పహారా కాస్తున్నామన్నారు. పోక్సో కేసుల్లో కఠిన శిక్షలు, ఆరుగురికి జీవిత ఖైదు పడిందన్నారు. పటిష్టమైన గస్తీ వల్ల ఇవి 698 నుంచి 516కు తగ్గి 26 శాతం క్షీణత సాధించినట్లు తెలిపారు. మహిళలపై నేరాలకు సంబంధించి 763 నుండి 697 శాతానికి తగ్గాయని తెలిపారు. ఇందులో అత్యాచార కేసులు 50 శాతం, మహిళా హత్యలు 67 శాతం తగ్గాయని తెలిపారు. మహిళ, పోక్సో కేసుల్లో మొత్తం 25 మందికి శిక్షలు పడ్డాయని తెలిపారు. జిల్లాలో 343 రౌడీ షీట్లు క్రియాశీలకంగా ఉంచి, 4 మందిపై పీడీ యాక్ట్ ప్రయోగించారని తెలిపారు. 2026 ఏడాదిలో ఎఐ ఆధారిత దర్యాప్తు టెక్నాలజీ ఆధారంగా ఇంటిలిజెన్స్ పోలీసింగ్‌తో పాటు అత్యధిక శిక్షణ ఇచ్చి నేరాలను మరింత కట్టడి చేస్తామని అన్నారు. అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్ డిఎస్‌పి ఎంవివి.సత్యనారాయణ, జిల్లా స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ కెవివిఎన్.సత్యనారాయణ, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ దేశంశెట్టి వెంకటేశ్వరరావు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి

నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తాం

ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పరిశ్రమలు నెలకొల్పి తద్వారా నిరుద్యోగుల సమస్యను పరిష్కరించాలనే ముఖ్యమంత్రి చంద్రబాబు కలను నెరవేర్చే దిశగా అడుగులు వేస్తున్నామని ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. కొండ్రుపోలు గ్రామంలో రైజ్ ఇండియా ఫార్మ స్యూటికల్స్‌ను ఎంఎల్‌ఎ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ బొలిశెట్టి మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో పాటు నిరుద్యోగ సమస్య వెంటాడుతున్న ప్రస్తుత తరుణంలో రాష్ట్రానికి నూతన పరిశ్రమలను రప్పించడం ద్వారా నిరుద్యోగ సమస్యను పరిష్కరించే దిశగా ముఖ్యమంత్రి ఆలోచనను తాము ఆచరణలో పెడుతున్నామని తెలిపారు. దీనికి యువ పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహిస్తూ వారిచే ఇటువంటి ఫ్యాక్టరీలు ఏర్పాటు చేసేందుకు వారికి అవసరమైన తోడ్పాటు అందిస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని పరిశ్రమలు నెలకొల్పేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు వర్తనపల్లి కాశి, పెంటపాడు మండలం అధ్యక్షుడు పుల్లా బాబి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో నాగ నవ్య ప్రతిభ

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకూ తూర్పుగోదావరి జిల్లా రావులపాలెం మండలం వెదరేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన పదో రాష్ట్రస్థాయి సీనియర్ నెట్ బాల్ పోటీల్లో భీమవరం కెసిఆర్ఎల్ ఫార్మసీ కళాశాల విద్యార్థిని డి.నాగనవ్య జిల్లా జట్టు నుండి ప్రాతినిధ్యం వహించి జట్టు కాంస్య పతకం గెలిచిందని కళాశాల ప్రిన్సిపల్ టి.రాఘవ తెలిపారు. కాంస్య పతకాన్ని గెలిచిన నాగ నవ్యను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మెంటే రామ్ మనోహర్, డైరెక్టర్ కావల నాగేశ్వరరావు, ప్రిన్సిపల్ డి.రాఘవ, అధ్యాపక అధ్యాప కేతర సిబ్బంది అభినందించారు.

కోపల్లెలో వాలీబాల్ క్రీడోత్సవం

ప్రజాశక్తి - కాళ్ల

వాలీబాల్ క్రీడోత్సవంలో కోపల్లె హైస్కూల్ విద్యార్థులు మంచి క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించారని ప్రధానోపాధ్యాయురాలు కె. నిర్మలాదేవి మంగళవారం తెలిపారు. కోపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వాలీబాల్ క్రీడోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. పాఠశాలకు చెందిన 12 మంది విద్యార్థులు వారి క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించగా, వారికి కోపల్లె వాలీబాల్ అకాడమీ మెడల్స్ సర్టిఫికెట్లు అందజేశారు. భీమవరం పరిసర ప్రాంతాల ఉన్నత పాఠశాలలకు వాలీబాల్ కిట్లు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పిఇటి కె.విజయశ్రీ, ఆర్. విక్టోరియమ్మా, నేషనల్ వాలీబాల్ ప్లేయర్ శ్రీనివాసరాజు, సర్వోదయ మండలి అధ్యక్షులు ఐ.ప్రసాద్‌రాజు పాల్గొన్నారు.

యూరియా కొరత లేదు : ఎఒ ప్రసాద్

గణపవరం:మండలంలో యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్ మంగళవారం తెలిపారు. 240 టన్నుల యూరియా నిల్వ ఉన్నట్లు తెలిపారు. కోఆపరేటివ్ సొసైటీ ప్రయివేటు షాపులు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉందని అన్నారు. షాపుల వద్ద యూరియా స్టాకు బోర్డు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పిప్పర, కేశవరంలో ఎరువుల షాపులు తనిఖీ చేసినట్లు చెప్పారు

ఎపిటిఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

భీమవరం :ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ 2026 డైరీ, క్యాలెండర్‌ను ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్య గురించి ఎంతో శ్రద్ధ పెట్టి బడ్జెట్లో ఎంతో ఖర్చు పెడుతోందన్నారు. ప్రతి ఉపాధ్యాయుడూ విద్యార్థులకు చక్కని బోధన చేసి పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు వచ్చేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు టి.ప్రకాశం, జిల్లా ఉపాధ్యక్షులు జి.ప్రసన్నకుమార్, మండల అధ్యక్షులు ఐ.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పి.పీటర్, కార్యవర్గ సభ్యులు వై.విజయకుమార్, తాళ్లూరి ఎసోబు, వి.నరేంద్ర, రాంబాబు పాల్గొన్నారు.

గిన్నిస్ బుక్ రికార్డులో ఫణిశ్రీకి చోటు

ఉండి:కూచిపూడి నృత్య ప్రదర్శనలో ఓ బాలిక గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సాధించింది. ఈ నెల 27న హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన కూచిపూడి నృత్య పోటీలో మండలంలోని చెరుకువాడ గ్రామానికి చెందిన దివ్యాన్ ఫణిశ్రీ వెలిగట్ల అద్భుత ప్రతిభ కనబర్చి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించింది. గత కొంత కాలంగా ఆమె కూచిపూడి నృత్యంలో అద్భుత ప్రదర్శనలు ఇస్తోంది. ప్రస్తుతం బాలిక హైదరాబాద్‌లో పదో తరగతి చదువుతోంది. మూడేళ్లుగా దివ్యాన్ ఫణిశ్రీ కూచిపూడి నృత్యంలో శిక్షణ పొందుతోంది. దివ్యాన్ ఫణిశ్రీ ప్రతిభ చూపి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సర్టిఫికెట్లను సొంతం చేసుకోవడం పట్ల ఆమె తండ్రి సత్య ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు బాలికకు అభినందనలు తెలియజేశారు.

పిహెచ్‌సిల్లో ప్రసవాలు పెంచాలి : డిఎంహెచ్‌ఒ

గణపవరం:ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలు పెంచాలని డిఎంహెచ్‌ఒ జి.గీతాబాయి వైద్యులకు సూచించారు. మంగళవారం స్థానిక పిహెచ్‌సిని సందర్శించిన ఆమె స్థానిక వైద్యాధికారులతో మాట్లాడారు. వైద్యఆరోగ్య కేంద్రంలో ఎన్ని రకాల రక్త పరీక్షలు చేస్తున్నది అడిగి తెలుసుకున్నారు. రోజువారీ డేటా ఎంట్రీ ఎన్నిసార్లు చేస్తున్నారని అడిగారు. పిహెచ్‌సికి అవుట్ పేషెంట్లు ఎంతమంది వస్తుందనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ డేటా ఎంట్రీ నేషనల్ ప్రోగ్రాం గురించి వివరించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులను మర్యాదపూర్వకంగా పలుకరించి, వారికి వైద్య పరీక్షల అనంతరం మందులు ఇచ్చి పంపాలని సూచించారు. ఆసుపత్రిలోని గదులను, లేబరేటరీలను పరిశీలించి ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఎం.ఓంకార్‌నాథ్, పి.కిరణ్మయి, సిహెచ్‌ఒ జాలాది విల్సన్‌బాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ

నరసాపురం:పట్టణంలోని ప్రథమశ్రేణి గ్రంథాలయంలో మంగళవారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శేఖర్‌బాబు ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. గ్రంథాల యానికి విచ్చేసిన పాఠకులతో ముచ్చటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రంథాలయ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. గతంలో ప్రతిపాదించిన భవనం నిర్మాణం మధ్యలో నిలిచిపోవడంపై ఆరా తీశారు. అనంతరం ఆర్‌డిఒ దాసిరాజును కలిశారు. గ్రంథాలయానికి తాత్కాలికంగా అద్దె భవనం చూపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో లైబ్రరీ అధికారి కెజెఎస్ఎల్ కుమారి, రంగినీడి సుబ్బారావు, సుధీర్ మోహన్, భట్రీపోలు సత్యనారాయణ, సూర్యంబాబు, ఆత్మూరి రమా, ప్రవీణ్, ప్రవీణ్, జీవన్ ప్రభాకర్ పాల్గొన్నారు.

అన్నార్తులను ఆదుకోవాలి

ఉండి:సమాజంలోని అన్నార్తులను ఆదుకోవాలని లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ గాదిరాజు రంగరాజు అన్నారు. ఎన్ఆర్‌పి అగ్రహారంలో మంగళవారం ఉండి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. దాత లయన్ గాదిరాజు సుబ్బరాజు వారి తల్లిదండ్రులు గాదిరాజు రామకృష్ణంరాజు, సావిత్రి కోరిక మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు రంగరాజు తెలిపారు. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఎపి సింగ్ పుట్టినరోజును పురస్కరించుకొని ఈ కార్యక్రమం చేసినట్లు తెలిపారు. లయన్ రుద్రరాజు నరసరాజు, లయన్ ముదునూరి శివరామరాజు, లయన్ కన్నెగంటి రూత్ కళ, లయన్ బుద్ధరాజు సుబ్బరాజు మాట్లాడారు. లయన్ సత్తి బ్రహ్మారెడ్డి, లయన్ పాలతీర్థపు నరసింగరావు, లయన్ గొట్టుముక్కల రాము, లయన్ వెంకట్రామరాజు పాల్గొన్నారు.

యుటిఎఫ్ జిల్లా కార్యవర్గానికి ఇద్దరు ఎన్నిక

కె.సాయి రెడ్డి



కె.విశ్వనాథం

పెనుమంట్ర:పెంటపాడు డిగ్రీ కళాశాలలో జరిగిన 51వ యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశంలో 2025-26 సంవత్సరానికి గాను జిల్లా నూతన కార్యవర్గంలో మండలంలో ఇద్దరికి స్థానం లభించింది. ఈ మేరకు జిల్లా యుటిఎఫ్ ఆడిట్ విభాగం కమిటీ సభ్యునిగా ఎస్ఐ పర్రు మండల పరిషత్ మోడల్ ప్రయిమరీ స్కూల్లో పనిచేస్తున్న కర్రి సాయి రెడ్డిని ఎన్నుకున్నారు. రాష్ట్ర ఉపాధ్యాయుల కోసం కొత్తగా యుటిఎఫ్ ప్రారంభించిన కుటుంబ సంక్షేమ సంఘం విభాగం కమిటీ డైరెక్టర్‌గా బ్రాహ్మణ చెరువులోని మండల పరిషత్ మోడల్ ప్రైమరీ పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు కొండేటి కాశీ విశ్వనాథం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. ఎన్నికైన వారిని ఉపాధ్యాయులు, సిపిఎం అనుబంధ సంఘాల ప్రతినిధులు అభినందించారు.

ముక్కోటి ఏకాదశికి ఆలయాలు కిటకిట

కాళ్ల:వైకుంఠ ఏకాదశి సందర్భంగా కాళ్లకూరు వెంకటేశ్వర స్వామివారిని ఉత్తర ద్వార దర్శనం చేసుకునేందుకు యాత్రికులు మంగళవారం తెల్లవారుజాము నుంచే ఉత్తర ద్వార దర్శనం కోసం యాత్రికులు పెద్ద సంఖ్యలో పోటెత్తారు. ఉండి మాజీ ఎంఎల్‌ఎ మంతెన రామరాజు, డిఎన్ఆర్ కళాశాల అధ్యక్షులు గోకరాజు నరసింహరాజు, పివిఎల్ నరసింహరాజు, జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ భీమవరం పరిధి దేవాలయాల ఇన్‌స్పెక్టర్ అధికారులు విశేషంగా విచ్చేశారు. భీమవరం డిఎస్‌పి, సిఐ, కాళ్ల ఎస్ఐ పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. యాత్రికులకు దేవస్థానం వారు పులిహోర, తాగునీరు ఉచితంగా పంపిణీ చేశారు. దేవస్థానం ఛైర్మన్ అడ్డాల శివరామరాజు, ఆలయ ఇఒ మోకా అరుణ్‌కుమార్, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొని యాత్రికులకు ఎటువంటి ఇబ్బందీ కలగకుండా ఏర్పాట్లు చేశారు.

ప్రముఖులు వెంకన్నబాబు మృతి

ఆకివీడు :ఆకివీడు పట్టణ ప్రముఖుడు చాపల రైతు, ప్రముఖ సంఘ సేవకుడు, లయన్స్ జిల్లా ప్రముఖుడు సన్నిధి రామ వెంకటేశ్వరరావు (వెంకన్న బాబు) (56) మంగళవారం ఆకస్మికంగా మృతి చెందారు. నాలుగు రోజులుగా బిపి పెరిగి మెదడు నరాల్లో వచ్చిన మార్పుతో మంగళవారం ఉదయం ఆయన మృతి చెందారు. ఆయన మృతి పట్ల లయన్స్ పట్టణ మండల, జిల్లా ప్రముఖులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. డాక్టర్ ఎంవిఎస్.సూర్యనారాయణ రాజు, ఆర్‌విఎస్.రాజు, ప్రతాప్ కుమార్, లయన్స్ అధ్యక్ష కార్యదర్శులు, పలువురు ప్రముఖులు ఆయన మృతికి సంతాపం తెలిపారు. ఆయన కుటుంబానికి సానుభూతి తెలిపారు.

CHANGE OF NAME

I, NAMBURI USHA RAJAKUMARI (Old name) W/o. N.E. BABU, Resident of Flat no G-4, Sohini Towers, Katta Subbarao Street, Ramachandrarao pet, Eluru, Eluru district, A. P. I have changed my name as PIDAKALA USHA RAJAKUMARI (New name) W/o. N.E.Babu Hereafter my name is known as PIDAKALA USHA RAJAKUMARI (New name) W/o.N.E.Babu.

అవినీతిపరులపై చర్యలు తీసుకోవాలి : ఐద్వా

ప్రజాశక్తి - ఆకివీడు

డ్వాక్రా సంఘాల్లో జరిగిన అవినీతిపరులపై చర్యలు తీసుకోవాలని డ్వాక్రా సంఘాల సమన్వయ కమిటీ డిమాండ్ చేసింది. ఐద్వా ఆధ్వర్యంలో పట్టణ అధ్యక్షురాలు డొకల లక్ష్మి అధ్యక్షతన మంగళవారం స్థానిక సంఘం కార్యాలయంలో సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షులు ఉదయ కుమారి పాల్గొని మాట్లాడారు. జాయింట్ కలెక్టర్‌కు వినతి అందజేసి 15 రోజులైనా ఎటువంటి చర్యలూ తీసుకోలేదని, ఇది ఎంత మాత్రమూ తగదని తెలిపారు. సంఘంలో సభ్యత్వం లేని వారి ఖాతాలకు డబ్బులు ఎలా జమ అయ్యాయో అర్థం కావటం లేదన్నారు. దీని వెనుక బ్యాంకు వారి హస్తం లేకపోలేదని సందేహం వ్యక్తం చేశారు. ప్రతి గ్రూపునకూ డబ్బులు వేసేటప్పుడు మెప్మా అధికారుల సంతకాలు తీర్మానంలో ఉండాలని, వారి సంతకాలు లేకుండా ఎలా డబ్బులు ఇచ్చారని ప్రశ్నించారు. ఈ అవినీతిలో ఉన్నతాధికారులు ఎవరైనా ఉంటే వారందరిపై చర్యలు తీసుకుని, డ్వాక్రా మహిళలకు న్యాయం చేయాలని ఆమె డిమాండ్ చేశారు. అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఐద్వా మహిళా సమన్వయ కమిటీగా డ్వాక్రా మహిళలతో కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం సభ్యులు డి.పద్మ, బి.కళ్యాణి, కృష్ణవేణి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే అవార్డుకు టీచర్ నందిని ఎంపిక

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలోని జివిఎస్ఆర్ మున్సిపల్ మోడల్ ప్రయిమరీ స్కూల్లో పనిచేస్తున్న జి.నందినికి గురు చైతన్య ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సావిత్రి బాయి పూలే అవార్డుకు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో ఉన్న జిల్లాల ఆధారంగా ప్రతి జిల్లాకూ 7 చొప్పున జనవరి మూడో తేదీన తుమ్మలపల్లి కళాక్షేత్రం విజయవాడలో జరిగే కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేస్తారు. నందిని విద్యార్థులను క్రమశిక్షణగా తీర్చిదిద్దడంతో పాటు, వారి మానసిక, శారీరక, భౌతిక పరిస్థితులను బట్టి అభ్యాసన కృత్యాలు సాధించడంలో ముందు వరుసలో ఉన్నారని తెలిపారు. టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ తయారుచేసి విద్యార్థుల స్థాయికి అనుగుణంగా పాఠ్యాంశాలు బోధించడంలో దిట్ట అని తెలిపారు. ఆమెను మంత్రి నిమ్మల రామానాయుడు, ఎంఇఒ గుమ్మల్ల వీరాస్వామి, ఎంఇఒ-2 శర్మ, పాఠశాల హెచ్ఎం రాయపూడి భవానీ ప్రసాద్, జివిఎస్‌విఆర్ఎం స్కూలు ఉపాధ్యాయులు అభినందించారు.

కేసులు పెట్టే సంస్కృతి కారుమూరిది

మాజీ మంత్రి తీరుపై కూటమి నేతల ధ్వజం

ప్రజాశక్తి - తణుకు

కేసులు పెట్టే సంస్కృతి మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావుదే అని తణుకు మార్కెట్ కమిటీ ఛైర్మన్ కొండేటి శివ విమర్శించారు. వైసిపి హయాంలో సొంత పార్టీ నేతలు, కార్యకర్తలపై కేసులు పెట్టించిన ఘనత మీది కాదా అని ప్రశ్నించారు. మంగళవారం తణుకు కూటమి కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ తేతలి వైజంక్షన్ సమీపంలో వైఎస్ఆర్ విగ్రహం ముందు కూటమి నాయకులు ఫ్లెక్సీలు పెట్టారని, నానా యాగీ చేసిన కారుమూరి గతంలోనూ కూటమి నేతలు అదే స్థానంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినప్పుడు ఎందుకు ప్రశ్నించలేదని అన్నారు. గతంలో వైసిపి అధికారంలో ఉన్న సమయంలో అప్పటి టిడిపి నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను మున్సిపల్ అధికారులతో తొలగించిన కారుమూరి దీనిపై ప్రశ్నించిన అప్పటి ఎంఎల్‌ఎ రాధాకృష్ణ, ఇతర నాయకులపై కేసులు పెట్టించారని గుర్తు చేశారు. తేతలి వై జంక్షన్ వద్ద ఏర్పాటుచేసిన వైఎస్ఆర్ విగ్రహం గత ఐదేళ్ల వైసిపి పాలనలో ఎందుకు ప్రారంభించుకోలేక పోయారని తేతలి సొసైటీ అధ్యక్షులు మట్టా వెంకట్ ప్రశ్నించారు. రాజశేఖర్ రెడ్డి చనిపోయిన సంఘటనను సైతం కారుమూరి హేళనగా మాట్లాడారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

10 నుంచి ఎస్‌వికెపి సర్ణోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - పెనుగొండ

ఎస్‌వికెపి పివి జూనియర్ కళాశాల, ఎస్‌వికెపి, కెఎస్ రాజు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల స్థాపించి 50 సంవత్సరాలు అయిన నేపథ్యంలో జనవరి 10, 11, 12 తేదీల్లో సర్ణోత్సవాలు ఘనంగా నిర్వహించనునట్లు కాలేజీ కరస్పాండెంట్ కెఎస్.రాజు మంగళవారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1974లో స్థాపించిన కళాశాల నేటికి 50 సంవత్సరాలు పూర్తి చేసుకుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థులతో పాటు ప్రతి ఒక్కరూ ఆహ్వానితులని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యక్షులు తాడి నాగిరెడ్డి, కాలేజీ కమిటీ, కళాశాల ప్రిన్సిపల్ అప్పారావు, జూనియర్ కళాశాల రమణ పాల్గొన్నారు.

సూర్యభాస్కరరావుకు మాతృవియోగం

ప్రజాశక్తి - పెనుమంట్ర

బిసి నవ చైతన్య వేదిక జిల్లా అధ్యక్షులు అల్లాడ సూర్య భాస్కరరావు మాతృమూర్తి అల్లాడ వరలక్ష్మి (68) మార్టేరులో సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. భర్త గతంలోనే మరణించారు. ఆమె అంగన్వాడీ ఆయాగా సేవలందిస్తున్నారు. వరలక్ష్మి మృతి పట్ల స్థానిక చేనేత కార్మిక సంఘం ప్రతినిధులు, అంగన్వాడీ కార్యకర్తలు సంతాపం తెలిపారు.

దస్తావేజు పడిపోయినవి

పాలకొల్లు పట్టణ కాపురస్తులు కంకిపాటి ప్రణీత, భర్త: అగ్రి సందీప్, డోర్ నెంబర్ 24-5-12, శిద్దుల గూడెం, శంభుని పేట ఇచ్చిన పత్రిక ప్రకటన ఏమనగా నా తాలూకు సొంత భూమి సర్వే నెంబర్ - 249, ప్లాట్ నెంబర్ 856, టిఎల్పి నెంబర్ - 25/2017/Hలోని 225 చ.గజాలు, శిల్పా బృందావన్, రంజోళి గ్రామం, జహీరాబాద్ మండలం, సంగారెడ్డి జిల్లా తెలంగాణలో ఉంది. ఇది రిజిస్టర్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెంబర్ 4014/2020, జహీరాబాద్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో నా పేరున రిజిస్టర్ అయి ఉంది. ఈ మధ్యన నేను పాలకొల్లు నుండి విజయవాడ బదిలీ అయ్యాను. నా ఒరిజినల్ దస్తావేజులు పాలకొల్లు లోని మా నాన్నగారు ఇంటివద్ద ఉంచగా ది 2-12-2025న వారు మరో ఇంటికి మారుతుండగా నా ఒరిజినల్ దస్తావేజులు కనిపించడం లేదు. వీటి కోసం ఎంత వెతికినా నా ఒరిజినల్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెంబర్ 4014/2020 దస్తావేజు దొరకలేదు. ఇవి ఎవరికైనా దొరికిన ఈ కింది ఫోన్ నెంబర్‌కు తెలియజేయగలరు. సెల్ 9908403828

మునిసిపల్ ఆఫీస్, పాలకొల్లు

ఆర్.ఓ.సి.నెం.769/2025/ఇ1 తేది.30-12-2025

ఇ-ప్రొక్యూర్‌మెంటు టెండరు నోటీసు

పాలకొల్లు పురపాలక సంఘ పరిధిలో గల 29వ వార్డులోని సమత మహిళా భవన్ (ప్లాస్టరింగ్ పనులు, తలుపులు మరియు కిటికీల భర్తీ, పెయింటింగ్, షెడ్ పనులు, మరుగుదొడ్లు మొదలైనవి) మరమ్మతులు & పునరుద్ధరణ మరియు సచివాలయానికి కంప్యూటర్లు, ప్రింటర్లు మరియు యుపిఎస్ ఏర్పాటు చేయుటకు పురపాలక సంఘ సాధారణ నిధుల నుండి చేపట్టుటకు గాను 2-పనులకు అంచనాలు విలువ సుమారు రూ.44,95,000/- లతో ఇ-ప్రొక్యూర్‌మెంటు ద్వారా టెండరు కోరడమైనది. టెండరు షెడ్యూలు ఇ-ప్రొక్యూర్‌మెంటు మార్కెట్ నందు ది.31-12-2025వ తేది సాయంత్రం గం.04.00 ని.ల నుండి లభించును.

బిడ్ డాక్యుమెంట్ ప్రారంభ తేదీ	: 31-12-2025 సాయంత్రం గం.04.00 ని.లకు
బిడ్ డాక్యుమెంట్ డౌన్లోడ్ ముగింపు తేది	: 19-01-2025 సాయంత్రం గం.3.00 ని.లకు
పైన బిడ్ తెరుచు తేది	: 19-01-2025 సాయంత్రం గం.03.30 ని.లకు

మిగిలిన వివరములు ఇ-ప్రొక్యూర్‌మెంటు మార్కెటు www.tender.apreprocurement.gov.in లేదా కమీషనరు, పాలకొల్లు పురపాలక సంఘము, పాలకొల్లు, పశ్చిమ గోదావరి జిల్లా వారిని సంప్రదించగలరు.

సం/- కమీషనరు, పాలకొల్లు పురపాలక సంఘం.